సీరియల్

అగ్ని సర్పం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

"ఆల్ రైట్.... జరిగిందేదో జరిగిపోయింది. ఇక ఆ విషయాన్ని వదిలెయ్యి."

స్టెల్లా ఇక మాట్లాడలేదు.

తొందరగానే కస్టమ్స్ చెకింగ్ పూర్తి చేసుకుని అక్కడినించి బయటపడి లాండయి వున్న ప్లేన్ దగ్గరకు వెళ్ళారు.

రెండు నిమిషాల్లో ప్లేన్లో ఎక్కారు.

అప్పటికే చాలావరకు నిండిపోయి వుంది. ఇంకో పది సీట్లు మాత్రమే ఖాళీగా వున్నాయి.

ప్లేన్ బయల్దేరటానికి ఇంకో పదినిమిషాల సమయం వుంది.

సిగరెట్ వెలిగించాడు భారత్.

స్టెల్లా కూడా ఓ సిగరెట్టు ముట్టించింది.

అతని మవునాన్ని ఆమె భంగపరచదల్చుకోలేదు.

అతనో సెంటిమెంటల్ ఇండియన్ అని ఆమె మనసులోనే నవ్వుకుంది.

చిన్నతనంనించీ స్టెల్లా విచ్చలవిడిగానే పెరిగింది. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులు అమెరికానించి వచ్చి కంపూచియాలో స్థిరపడిపోయారు. ఒక్కతే కూతురు కావటంతో ఆమె గారాబంగా అలా పెరిగింది.

రెండేళ్ళ క్రితం ఓ ప్లేన్ యాక్సిడెంట్‌లో స్టెల్లా తల్లిదండ్రులిద్దరూ పోయారు.

అప్పుడే స్టెల్లా ఒంటరిదై పోయింది.

మరికొన్ని నిమిషాల్లో ప్లేన్ బయల్దేరబోతున్నట్టు ఎనౌన్స్ చేశారు.

ప్లేన్ పూర్తిగా నిండిపోయింది.

కొన్ని క్షణాల తర్వాత ప్లేన్ కదిలింది. ముందుకు పరుగుతీసి గాల్లోకి లేచింది.

"గుడ్ బై టు కంపూచియా" అన్నది స్టెల్లా.

*   *   *

"ఇంకా నువ్వు ఆ డర్టీ డెవిల్ ఆలోచనలనించి బయటపడలేదా?" అడిగింది.

తలవూపి "ఓ మంచి మనిషిని హత్య చెయ్యటం ఎంత కాదనుకున్నా నాకు బాధనే కలిగిస్తోంది" అన్నాడు.

"మీ ఇండియన్స్ అంతా ఇంతేనా?"

"అంటే?"

"నీలాగే ఓ హత్య చేసి వణికిపోతూ బాధపడే మనుషులేనా?"

"చాలావరకు అంతే కావచ్చు."

నవ్వింది స్టెల్లా.

"అవునులే.... ఇండియా శాంతికాముక దేశం కదూ!?" అన్నది తర్వాత.

"కెరోన్‌ను మనం హత్య చెయ్యక తప్పదు. దాన్ని చంపకుండా వున్నట్లయితే ఆమె మనల్ని రొనాల్ట్ ఎపార్టుమెంట్స్‌లో నించి బయటకు కూడా రానిచ్చి వుండేదికాదు" చిన్నగా అన్నది అతనికే వినపడేలా.

"నిజమే....నువ్వు కనపడకుండా వుంటే బావుండేది. నేనొక్కడినే వినట్లయితే ఎలాగో ఆమెను కన్విన్స్ చేసేవాడిని. మనిద్దరం ఏర్‌పోర్టు దగ్గర కలుసుకునేవాళ్ళం."

"నో....ఎన్నటికీ అలా జరిగివుండేది కాదు. కేరోన్ అంత సులభంగా నిన్ను వదిలిపెట్టేది కాదు! చివరకి ఆదే ఈ స్థానంలో నీ పక్కనే కూర్చునేది."

భారత్ తిరిగి మౌనం వహించాడు.

మూడునెలల క్రితం అతను కంపూచియా వచ్చాడు. అంతకుముందు కూడా అతను యెన్నోసార్లు అక్కడకు వచ్చాడు భారతదేశంనించి. మిగిలిన దేశాల్లో కంటే అక్కడ మేలురకం వజ్రాలు దొరుకుతాయని అతని నమ్మకం.

ఓసారి ఓ బిజినెస్ ఏజెన్సీలో కెరోన్‌తో పరిచయమయ్యింది. అతని అందం చూసి కెరోన్ పరవశించిపోయింది. అప్పటికప్పుడే అతనికి తన హృదయాన్ని ఇచ్చేసింది. ఆ విషయాన్ని తెలుసుకున్న భారత్ ఆమె అందంతో ఆటలాడుకున్నాడు. ఆమె యవ్వనాన్ని కొల్లకొట్టాడు.

బిజినెస్ పరంగా కూడా కెరోన్‌తో తన పనులు ఎన్నో నెరవేర్చుకున్నాడు.

ఆ తర్వాతనే అతనికి ఓ ఎగ్జిబిషన్‌లో స్టెల్లాతో పరి

చయం జరిగింది. స్టెల్లా కెరోన్‌కంటే ఎన్నో రెట్లు అందమైన యువతి కావటంతో భారత్‌కి కెరోన్ మీద ఇంట్రెస్టు బాగానే తగ్గిపోయింది.

స్టెల్లా కూడా అతనితో ఇండియాకు వస్తానన్నది. సంతోషంగా ఒప్పుకున్నాడు భారత్.

అక్కడక్కడ ఒకరిద్దరు మాట్లాడుకుంటున్నా చాలా మంది ప్రయాణీకులు మౌనం వహించారు.

స్టెల్లా ఒకటి రెండుసార్లు భారత్‌తో మాట్లాడాలని అనుకున్నది. కాని అతన్ని చూసిన తర్వాత ఆ ప్రయత్నం చెయ్యలేదు.

ఆమెకూడా ఆలోచనల్లోనే మునిగిపోయింది.

తన తల్లిదండ్రులు అప్పుడప్పుడు ఇండియా గురించి గొప్పగా చెబుతూ వుండేవాళ్ళు.... భారతీయుల గురించి భారత స్త్రీల అందచందాల గురించి వింటూ వుండేది. భారతీయుల నాగరికత, వాళ్ళ స్నేహస్వభావం గురించి కొన్ని నవలల్లో కూడా చదివింది.

అప్పుడే స్టెల్లా ఎప్పటికైనా తను ఇండియా వెళ్ళి అక్కడ కొన్ని రోజులు గడపాలని యెంతో గాఢంగా అనుకున్నది.

అందుకే మొదటిసారిగా—కంపూచియాలో జరుగుతున్న ట్రేడ్ ఎగ్జిబిషన్‌లో భారత్‌ను కలుసుకున్నప్పుడు ఆమె హృదయం సంతోషంతో ఎగిరిపడింది.

ఒకరి అందం ఒకరిని అమితంగా ఆకర్షించటం వల్ల కొన్ని నిమిషాల్లోనే ఇద్దరూ గొప్ప ప్రేమికుల్లా మారిపోయారు.

భారత్ రూపం ఆమెలో చెరగని ముద్రవేసింది.

"స్టెల్లా" చిన్నగా పిల్చాడు భారత్.

"ఏమిటి?" అతనివైపు తిరిగింది.

"ఆలోచిస్తున్నావు ఎవరి గురించి?"

"నీ గురించే."

"నీకు మరో పని లేదా నా గురించి ఆలోచించటం తప్పించి."

"లేదు. నేను నీకోసమే బతుకుతున్నాను. ఐయామ్ బ్రీదింగ్ ఓన్లీ ఫర్ యూ."

"థాంక్ యూ" సున్నితంగా ఆమె చేతిమీద ముద్దు పెట్టుకున్నాడు.

"నాకు భయంగా వుంది భారత్."

"ఎందుకు?"

"ఇండియా వెళ్ళిన తర్వాత అక్కడి అందగత్తెల వలలో చిక్కి నన్ను మరచిపోవుకదా."

"యూ సిల్లీ.... ఈ భారత్ ఎప్పటికీ నీ మనిషే. అలాంటి భయాన్ని నీలోనించి దూరంగా తరిమివెయ్యి శైలా."

"ఐయామ్ డామ్ లక్కీ భారత్."

* * *

ప్లేన్ ఆకాశంలో దూసుకు వెళుతోంది.

నిమిషాలు—గంటలు గడుస్తున్నాయి.

ఉన్నట్టుండి ఏదో గొడవ వినిపించింది.

శైలా మాట్లాడబోయి ఆగిపోయింది.

వెనక్కి తిరిగి చూశారు.

ఎవరో ఇద్దరు—బల్గేరియా దేశస్థుల్లా వున్నారు.... ఒకరిమీద ఒకరు కలియబడుతున్నారు.

"ఐ విల్ డ్రింక్ యువర్ బ్లడ్" ఒక వ్యక్తి అంటున్నాడు. అతనికి నలభై యేళ్ళలోపు వుంటాయి.

కొంచెం సన్నగా వున్నాడు.

"యూ ఇడియట్" రెండో మనిషి అతనిమీదకు వచ్చాడు.

అసలు ఏం జరిగిందో ఎందుకు వాళ్ళిద్దరూ అలా తిట్టు కుంటున్నారో ఎవ్వరికీ అర్థంకాలేదు.

"వాట్ హేపెండ్?" ఓ ముసలాయన స్టైల్గాను అడిగాడు.

"ఐ డోంట్ నో."

వాళ్ళు తిట్టుకుంటున్నారు. అప్పుడే కునుకు తియ్యబోతున్న కొంతమంది విసుక్కుంటున్నారు.

"వాటీజ్ దిస్ న్యూసెన్స్" అన్నాడా ముసలాయన.

ఆయన పక్కనే కూర్చున్న యువతి లేచి నిల్చుని టాయిలెట్ రూమ్కేసి నడిచింది

ఆ యువతి అందం చాలామందిని ఆకర్షించింది.

మెరుపు తీగెలా వుంది.

భారత్ కూడా ఆమె కనిపించినంతవరకు చూశాడు. అప్పటివరకు ఆమెను గమనించనందుకు బాధపడ్డాడు.

"భారత్ ....ఆమె నాకంటే అందంగా వున్నదా?"

అతను నవ్వి "లేదు. ఆమె నీకంటే అందంగా లేదు. నీ అంత అందంగా వున్నది" అన్నాడు.

"ఏమైనా ప్లేన్లో చాలామంది మగాళ్ళ దృష్టిని ఆకర్షించింది."

"అవును."

"నీ దృష్టిని కూడా."

"నేనూ మగాడ్నే కదూ."

వాళ్ళలా మాట్లాడుకుంటూ వున్నప్పుడే ఆ ఇద్దరి గొడవా తారస్థాయి నందుకుంది.

అంతులో ఒకడు జేబులోనించి పిస్తోలు బయటకు తీశాడు.

ప్రయాణీకులు భయపడ్డారు.

ఇంతలో టాయ్‌లెట్ రూమ్‌లోకి వెళ్ళిన ఆ అందాల సుందరి అప్పుడే బయటకు వచ్చింది.

సరిగ్గా అదే సమయంలో ఏర్ హోస్టెస్ ఆ మనుషుల మధ్యకు వచ్చింది.

ఒకే ఒక్క నిమిషం.

కెవ్వుమన్న అరుపు.

ఏం జరుగుతుందో తెలుసుకునే లోపుగానే అందాల సుందరిని ఓ నల్లగా కర్కశంగా వున్న మనిషి తన సీట్లోనించి చివాలున లేచినిల్చుని వెనుకనించి ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి గట్టిగా బిగించాడు.

అప్పుడా యువతి కెవ్వున అరిచింది.

వెంటనే క్షణంలో నల్లగా నిగనిగలాడుతున్న పిస్తోలు ప్రత్యక్షమయ్యింది అతని చేతిలో.

అదే క్షణాల్లో—

గొడవపడుతున్న యిద్దరిలో ముందుగా పిస్తోలు బయటకు తీసిన మనిషి ఏర్ హోస్టెస్‌ను కూడా వెనుకనించి గట్టిగా పట్టుకుని "ఎవ్వరూ కదలకండి" అని ఓ ఆజ్ఞ జారీచేశాడు.

అందాల సుందరి — ఏర్ హోస్టెస్ ప్రాణభయంతో గిలగిల్లాడిపోయారు.

ప్రయాణీకుల మధ్య అప్పటివరకూ ఏదో ఇంగ్లీష్ మేగజైన్ చదువుకుంటున్నట్టు నటిస్తున్న ఓ పొట్టిగా వున్న బట్టతల మనిషికూడా ప్యాంటు జేబులోనించి పిస్తోలు బయటకుతీసి యెవ్వరికీ కనపడకుండా పట్టు

కున్నాడు.

"జాగ్రత్తగా వినండి.... మేము విమాన దొంగలం. మిమ్మల్ని దోపిడీ చెయ్యటమే మా ధ్యేయం. దయచేసి మీరు మాతో సహకరించి మీ దగ్గర వున్న విలువైన వస్తువులను మాకు వెంటనే యిచ్చేస్తే మా పని పూర్తి అవగానే ఈ ప్లేన్ను ఎక్కడో ఒకచోట ఆపుచేయించి మేము వెళ్ళిపోతాం. ఎవరైనా ప్రతిఘటించినా, ఎదురు తిరిగే ప్రయత్నం చేసినా ముందుగా ఈ అందాలసుందరి ఏర్ హోస్టెస్ ప్రాణాలను పోగొట్టుకుంటారు. ఆ తర్వాత వరుసగా మా దగ్గర వున్న పిస్తోళ్ళ గుండ్లకు బలి చేస్తాం."

ఆ హెచ్చరిక వినగానే అందరికీ ప్రాణాలు ఎగిరి పోయినట్లు అనిపించాయి.

ఊహించని పరిణామం.

వాళ్ళిద్దరూ దొంగలే. ఒకరికొకరు గొడవపడి తిట్టు కుంటున్నట్టు నటించి అందరి దృష్టినీ ఆ వైపుకు మర లించి ఆ అందాల సుందరిని పట్టుకున్నారు.

ఇప్పుడేమిటి చెయ్యటం?

వాళ్ళు అడిగినట్టుగా విలువైన వస్తువులన్నింటినీ ఆ నలుగురు దొంగలకీ ఇచ్చెయ్యటమేనా?

"భారత్."

చిన్నగా పిల్చింది స్టెల్లా.

"ఊ."

"వజ్రాలు."

"ష్. అరవకు ప్రమాదం."

చిన్నగానే కసురుకున్నాడు భారత్.

అతని ఆలోచనలన్నీ ఆ వజ్రాల గురించే వున్నాయి.

లక్షలు విలువచేసే వజ్రాలు తన దగ్గర వున్నాయి. వాటిని ఆ విమాన దొంగల బారిన పడకుండా దాచటం సాధ్యమవుతుందా? వాళ్ళకు అనుమానం వచ్చిందంటే మనిషిని ముక్కలు ముక్కలుగా కోసి అంగుళం అంగుళం వెతుకుతారు.

అలాంటి దొంగల గురించి ఇంతకుముందు తను ఎన్నో సార్లు విన్నాడు.

కాని—

వాళ్ళను ప్రత్యక్షంగా కలుసుకోవటం ఇప్పుడే.

ఆలోచిస్తున్నాడు.

స్టెల్లా ఆలోచిస్తోంది.

ప్రయాణీకులందరూ ఆలోచిస్తున్నారు.

దొంగలు కూడా ఆలోచిస్తున్నారు.

“హాంకీల్” అందాల సుందరిని పట్టుకున్న దొంగ కంఠం ఖంగుమన్నది.

అప్పటివరకూ 'మేగజైన్' చాటున పిస్తోలు పట్టుకుని కూర్చున్న పొట్టిమనిషి చివాలున లేచి నిల్చున్నాడు.

“స్టార్ట్ యువర్ వర్క్” అర్చాడతను.

వెంటనే దోపిడీ మొదలయ్యింది.

హాంకీల్ పెద్ద సూట్కేసు తీసుకున్నాడు.

ఒక్కొక్కరి దగ్గరికీ వెళుతున్నాడు.

ఈ లోపుగా మరోసారి అందరికీ హెచ్చరిక వినపడింది.

“దయచేసి యెవ్వరూ ప్రాణాలు పోగొట్టుకోకండి. ప్రాణాలు తీయటం మాకు సరదా. ఐనా మీరు బుద్ధిగా ప్రవర్తిస్తే మీ ప్రాణాలకు ప్రమాదంలేదని మీకు హామీ ఇస్తున్నాము.”

ఆ హెచ్చరిక చేసిన మనిషి అందాల సుందరిని మరింత గట్టిగా నొక్కాడు.

ఆమె కెవ్వుమన్నది మరోసారి.

పెద్దగా నవ్వాడతను.

నలుగుర్లో ఒకడు కేబిన్ రూమ్‌లోనించి యెవ్వరూ బయటకు రాకుండా పిస్తోలుతో కాపలా కాస్తున్నాడు. ఓ యాభై యేళ్ళు దాటుతున్న స్త్రీ దగ్గరకు వచ్చాడు షాంకీల్.

ఆమె వేలికి వజ్రపు ఉంగరం వుంది.

"ఊ....ఇవ్వు" పిస్తోలు వూపుతూ హుంకరించాడు అతను.

"నో. ఐ వోంట్ గివ్ దిస్ డైమండ్ రింగ్. దిస్ వాజ్ ప్రెజెంటెడ్ బై మై హస్బెండ్. బిసైడ్ మై లైఫ్ ...నో... నో" పెద్దగా యేడ్చింది ఆమె.

అంతా చూస్తున్నారు.

ఆ దృశ్యం చూస్తుంటే చాలామంది కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

"వాటీజ్ దట్ నాన్సెన్స్."

షాంకీల్ పిస్తోలును ఆమె కణతలకు నొక్కిపెట్టి "యూ ఓల్డ్ బిచ్. ముందు ఆ ఉంగరం తీసివ్వు. లేకపోతే నువ్వూ నీ మొగుడి దగ్గరకు వెళతావ్" కర్కశంగా అన్నాడు పళ్ళు బిగబట్టి.

"ఇవ్వను. ఇవ్వను" పెద్దగా అరవబోయిందామె.

అంతే.

షాంకీల్ పిస్తోలు వెనక్కు తిప్పి ఆమె తలమీద గట్టిగా కొట్టాడు.

చిన్నగా మూల్గి తల వాల్చింది ఆమె.

ఆమె వేలికి వున్న డైమండ్ రింగ్‌ను బలవంతంగా లాగేశాడు.

ఇదంతా చూస్తూ మిగిలిన ప్రయాణీకులందరూ గజగజ వణికిపోయారు. షాంకీల్ ఒక్కొక్కరి దగ్గరకూ వస్తుంటే అంత ముందుగానే వాళ్ళ దగ్గర వున్న విలువైన వాటన్నింటినీ బయటకుతీసి రెడీగా వుంచుకున్నారు

భారత్ మెదడులో ఆలోచనలు విమాన వేగంతో ప్రయాణిస్తున్నాయి.

ప్రయాణీకుల దృష్టి అంతా షాంకీల్ మీదా ఏర్ హోస్టెస్‌ను పట్టుకున్న మనిషిమీదా నిమగ్నమై వుంది.

వాళ్ళెవ్వరూ అందాల సుందరినీ, ఆమెను పట్టుకున్న మనిషినీ గమనించలేదు.

కాని—స్టెల్లా ఎందుకో ఆ యువతిని చూసి ఉలిక్కిపడింది.

అతను ఆ యువతిమీదకు తలవాల్చి చిన్నగా ఏదో అంటున్నాడు. ఆమె నడుంమీద చేతితో నిమురుతున్నాడు.

ఆమె నవ్వుతోంది.

చిన్నగా యేదో గొణుగుతోంది.

"భారత్" పిల్చింది స్టెల్లా.

"వూఁ...."

"ఆ బ్యూటీని చూడు" చిన్నగా అన్నది.

"చూస్తున్నాను. ఆమెకూడా ఈ దొంగల ముఠాలో మనిషే. అంతా నాటకం."

"ఐతే ఏర్ హోస్టెస్ కూడా ఇందులో మనిషేనా?"

"ఏమో....ఐవుండొచ్చు."

విమానం గాల్లో దూసుకుపోతోంది.

లోపల ఇంత దోపిడీ జరుగుతున్నా కేబిన్ రూంలో వున్న మనుషులకు కొంచెంకూడా తెలీదు.

సముద్రంమీద ఎగురుతోంది విమానం.

షాంకీల్—భారత్ దగ్గరకు వస్తున్నాడు.

మధ్యలో ఇంకో ఇద్దరు వున్నారు.

ఓ ముసలాయన అయానే స్టెల్లాను 'ఏమిటా గొడవ' అని అడిగినాయన.

ఆయన షాంకీల్ తన దగ్గరకు రావటంతోనే "టేక్ దిస్.... టేక్ దిస్" అంటూ తన దగ్గరవున్న రెండు బంగారు వుంగరాలు, ఇంకొంత కరెన్సీ ఇచ్చేశాడు.

తర్వాత మరో మనిషి.

ఆ మనిషి వంతుకూడా ఐపోతే ఇక మిగిలింది భారత్.

అతని గుండెలు అదురుతున్నాయి.

ఎంతో కష్టపడి సేకరించిన విలువైన వజ్రాలు. అంతే కాదు. చివరి క్షణాల్లో—కరోన్‌ను హత్యచేసి ఆమె సూట్కేసులో వున్న గోల్డు కాయిన్స్, వజ్రాలుకూడా ఇప్పుడు ఈ విమాన దొంగలు, హైజాకర్స్ దోపిడీకి గురి కాబడుతున్నాయా?

ఆలోచిస్తుంటే మెదడు పేలిపోతున్నట్టు అనిపించింది.

ఇప్పుడేమిటి చెయ్యటం?

తనదగ్గర పిస్తోలు వుంది.

దాంతో ఆ దొంగలను ప్రతిఘటిస్తే?

సాధ్యమేనా? తను వాళ్ళను ఎదిరించగలడా?

తనకు తోడుగా స్టెల్లా వుంది.

స్టెల్లా!

అవును. స్టెల్లా సాధారణమైన ఆడదికాదు.

ఆడపులి.

తెగువ—చొరవ ఉన్న మనిషి.

గురితప్పకుండా పిస్తోలు పేల్చగలదు.

ఐనా—స్టెల్లా ఏమని ఆలోచిస్తోంది? ఇలాంటి పరిస్థితుల్లో స్టెల్లావంటి ధైర్యం — తెగువ వున్న ఆడది చూస్తూ వూరుకోదు. ఆమెకు తెలుసు. తన దగ్గర వున్న లక్షలు విలువచేసే వజ్రాలు—బంగారం గురించి.

మాట్లాడుకోటానికి వీల్లేదు.

షాంకీల్ దగ్గరలోకి వచ్చాడు.

ఇక ఆలోచించటానికి వ్యవధిలేదు. మొత్తానికి తను ఏదో చెయ్యాలి. తన సంపదను ఈ విమాన దొంగలకు అప్పగించటానికి వీల్లేదు.

ఆ సమయంలో హఠాత్తుగా భారత్‌కు కెరోన్ గుర్తుకు వచ్చింది.

కెరోన్.

చావబోతూ తమని శపించిన ఆడది.

కెరోన్ శాపం నిజం అవుతుందా? లేకపోతే తను ఈ విమాన దొంగలబారిని పడతాడని వూహించగలిగాడా?

దీనికంతటికీ కారణం కెరోన్ శాపమేనా?

ఓ కెరోన్....నన్ను క్షమించు.

అతని ఆలోచనలు ఇలా వున్నప్పుడే ఒక్కసారిగా స్టెల్లా చిన్న జర్క్‌తో కదిలినట్లు అనిపించింది.

మెరుపు వేగంతో ఆమె చెయ్యి పనిచేసింది. పట్టులో గుండెల మధ్య వున్న రివాల్వర్‌ను బయటకు లాగి అందాల సుందరిని పట్టుకున్న వాడిచేతికేసి గురి చూడ

ఉండగానే పేల్చింది.

ఢాం.... ఢాం.... — ఆమె గురి తప్పలేదు ఐనా.

• • •

బాధతో అరిచాడు వాడు. వాడి చేతిలో వున్న పిస్తోలు కిందపడిపోయింది.

ప్రయాణీకులంతా ఉలిక్కిపడ్డారు.

షాంకీల్ ఎలర్టు అయ్యాడు. అతని చేతిలో వున్న సూట్కేసును బిగించి పట్టుకుంటూనే స్టెల్లా వెపు తిరిగాడు.

ఐతే—అప్పటికే భారత్ క్షణంకూడా వృథా చెయ్యకుండా ప్యాంటు జేబులోనించి రివాల్వర్ బయటకు లాగి షాంకీల్ కేసి కాల్చాడు.

పక్కకు తప్పుకున్నాడు షాంకిల్.

గురి తప్పింది.

రివాల్వర్ మోత విని కేబిన్ రూంలోనించి ఓ మనిషి బయటకు వచ్చాడు. అంతే, అక్కడే కాపలా ఉన్న మనిషి పిస్తోలు పేల్చాడు. కెవ్వుమని బోర్లా పడిపోయాడు అతను.

వెంటనే కాపలా మనిషి లోపలకు పరుగుదీశాడు.

అంతా గొడవగా మారిపోయింది వాతావరణం.

స్టెల్లా మరోసారి రివాల్వర్ పేల్చింది. అందాల సుందరి గుండెల్లోకి దూసుకుపోయింది గుండు.

కసిగా నవ్వుకుంది స్టెల్లా.

మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది అందాల సుందరి.

"డర్టీ డెవిల్ .... నువ్వు అందాల సుందరివా .... నీ అందం నీతోనే అంతమైపోతోంది. ఈ ముఠాతో కలిసి

నాటకం ఆడతావా?" మరోసారి రివాల్వర్ పేల్చటానికి సిద్ధంగా వుంది స్టెల్లా.

బోర్లా పడిన వాడు లేవబోయాడు, కాని స్టెల్లా వాడికా అవకాశం ఇవ్వలేదు. ఈసారి గురిచూసి వాడి తలకేసి చూసి పేల్చింది.

మళ్ళీ ఆమె గురి తప్పలేదు. వాడి తల్లో దూరిపోయింది బుల్లెట్.

పెద్ద ఆర్తనాదం చేశాడు.

పక్కకు తప్పుకున్న షాంకీల్ ను మరోసారి కాల్చాడు భారత్.

కాని—వూహించని విధంగా ప్లేన్ ఓ పక్కగా ఒరిగిపోయింది. ఒకరిమీద ఒకరు పడ్డారు.

కేబిన్ లో మూడుసార్లు పిస్తోలు పేలిన చప్పుళ్ళు వినిపించాయి. వెంటనే ఓ యిద్దరి ఆర్తనాదాలు వినపడ్డాయి.

"మై గాడ్ పైలెట్ ను కాల్చేశారు" ముందుకు పడిపోతూ స్టెల్లాను పట్టుకుంటూ అన్నాడు భారత్.

స్టెల్లా ఏదో మాట్లాడబోయింది.

కాని అప్పటికే ప్లేన్ కంట్రోల్ లేకుండా ఒరిగిపోతుండటంతో బోర్లాపడిపోయింది.

అంతా గోలగా అరుస్తున్నారు.

ప్లేన్ ఒరిగిపోతోంది.

ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు పైకిలేచాయి.

పెట్రోలు టాంక్ అంటుకుంది. బుల్లెట్లు టాంకుకు తగిలి వుండాలి.

(సశేషం)